

# ఔరా!

## అన్నంరాజు వేణుగోపాల శ్రీనివాసమూర్తి

"నల్లగా, పొట్టిగా ఆ అవతారం చూడు... వీడి మొహానికి తోడు ఆ నల్ల కళ్ళజోడొకటి..." ఎదు రుగా సైకిల్‌మీద వస్తున్న తిలక్‌ని చూస్తూ నొసలు చిట్లించి అంది నవ్య.

"అలా అనకు నవ్యా.... అతను చాలా క్లాస్‌గా బిహేవ్ చేస్తాడు. ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడతాడు..." జయ అంటుండగానే తిలక్ వాళ్ళ దగ్గరగా వచ్చి సైకిల్ ఆపాడు.

"హాయ్... జయా! హౌ ఆర్యూ...?"

"ఫైన్.. మీరు బావున్నారా... ఇది నా ఫ్రెండ్ నవ్య, ఇదివరలో ఒకసారి పరిచయం చేశాను... మీకు గుర్తుందనుకుంటాను..."

"యస్... హౌ డు యు డూ...?" క్రాఫ్ పైకి తీసుకుంటూ పలకరించాడు నవ్యను. నవ్య నవ్వి "ఐ యామ్ ఓ.కె." అంది.

"వయసు పిలిచింది' సినిమాకు వెడుతున్నాం. మీరూ రాకూడదు మాతో...?" అంటున్న జయవైపు చిరాగ్గా చూసింది నవ్య. 'దీనికి బొత్తిగా బుద్ధి లేకుండా పోతోంది. సినిమా పేరు చెప్పి మరీ ఆహ్వానిస్తోంది... కొంపదీసి వస్తాననడు కదా!"

'వై నాట్... పదండి వెడదాం..." అంటూ కదిలాడతను.

ఎలా తప్పించుకోవాలో అర్థం కాలేదు నవ్యకు. ఆమె గురించి ఆలోచించే స్థితిలో లేదు జయ. తిలక్ వేసిన జోక్స్‌కి పగలబడి నవ్వుతోంది. జయ నవ్వినప్పుడల్లా ఎగిసిపడే ఆమె ఎదపొంగుల్ని కాంక్షగా చూస్తున్నాడతను. అవసరం ఉన్నా, లేకపోయినా పదే పదే పైట సర్దుకుంటోందామె.

"నవ్యగారూ! కామ్‌గా నడుస్తున్నారు. ఏమన్నా మాట్లాడవచ్చుగా..." సడన్‌గా అన్నాడు తిలక్.

"మీ ఇంగ్లీష్ జోక్స్ దానికర్థం అయి వుండవు. తెలుగులో చెప్పండి... పడీ పడీ నవ్వుతుంది" అంది జయ తిలక్ కళ్ళల్లోకి చూస్తూ.

సినిమా హాల్ సమీపించేదాకా తిలక్, జయ ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉన్నారు. నవ్య తప్పదన్నట్లు మధ్యమధ్యలో కాస్త చిరునవ్వు చిందించింది.

అతను వెళ్ళి టిక్కెట్లు తెచ్చాడు. నవ్య డబ్బులివ్వబోతే తీసుకోలేదు. "పర్వాలేదులేవే... నెక్స్ట్ టైమ్ మనం ఆయన్ని తీసుకెళదాం మరో పిక్చర్‌కి" అని తన టిక్కెట్ నంబరున్న ఛెయిర్‌లో

కూర్చుంది జయ. ఆమె తరువాతున్న ఛెయిర్‌లో గభాల్న కూర్చున్నాడు తిలక్. అతని ప్రక్క ఛెయిర్‌లో కూర్చోవడానికి నవ్య సందేహిస్తుంటే "కూర్చోవే... మనిద్దరి మధ్య తిలక్‌గారుంటే జోక్స్ వేస్తూ నవ్విస్తుంటారు" అంది జయ.

"మీకేమన్నా అభ్యంతరమైతే చెప్పండి... నేనటు వెళ్ళి జయను ఇటు రమ్మంటాను" అంటుంటే, జయకటువైపు కూర్చున్న నడివయసావిడ "వద్దులే అబ్బాయ్... ఈ అమ్మాయిని ఇక్కడే కూర్చోనీ" అంది ముఖం చిట్లించి అతన్ని చూస్తూ.

"అలాగే ఆంటీ!" అన్నాడు అదేదో సినిమాలో చిరంజీవిలా తిలక్.

"హుఁ..." అంటూ ముఖం స్క్రీన్ వైపుకి తిప్పిందావిడ.

ఇక నవ్యకా సీటు తప్పలేదు. ఇబ్బందిగానే కూర్చుంది. 'ఎవరైనా తమ కుటుంబానికి తెలిసినవాళ్ళు రాలేదు కదా సినిమాకి. ఒక మగాడి పక్కన కూర్చుని తను సినిమా చూశానని ఇంట్లో తెలిస్తే నాన్న చంపేయరూ! అమ్మ ఎంత రాద్ధాంతం చేస్తుంది! అసలీ జయతో రావడమే పొరపాటైంది' అనుకుంటూ ఒకసారి వెనకా, ముందూ పరికించి చూసింది. అన్నీ కొత్త మొహాలే కనిపించి కాస్త స్థిమితపడింది.

లైట్లు ఆఫ్‌చేసి ట్రైలరేదో స్టార్ట్ చేశారు.

ఛెయిర్‌లో సరిగా సర్దుకుని కూర్చుంది నవ్య. తన చెయ్యి అతని మీద పడింది. "సారీ" అని వెనక్కి తీసుకుంది.

"ఇట్సాల్ రైట్" అంటూ ఆమె ఛెయిర్ వెనకగా చేయి చాపుకుని కూర్చున్నాడతను. నవ్య వెనక్కి వాలినప్పుడు తన భుజానికి అతని చేయి తగిలి వళ్ళు ఝల్లుమంది. కొంచెం పక్కకి ఒదిగి కూర్చుంది. అతను చేతిని మరింత ముందుకు జరిపి మళ్ళీ ఆమె భుజాన్ని తాకాడు.

ఆ స్పర్శకు ఆమెలో వింత పులకింత! ఫ్రీగా జరిగి కూర్చుంది. అతని చేయి ఆమె భుజాన్ని జారి క్రిందికి సాగింది. మత్తుగా కళ్ళు మూసుకుంది నవ్య. ఏదో తీయని బాధ ఆమెలో. అలవాటైన పనేదో అలవోకగా చేసేయాలని అతని ఆరాటం! ఇంకాసేపు ఉంటే ఏం చేసేవాడో? కెవ్వున కేక పెట్టింది జయ.

"వాట్ హేపెండ్ జయా!" అంటూ ఆమె వైపు తిరిగాడు తిలక్.

"ఏదో పాకుతున్నట్టుందిక్కడ" అని గుండెలమీద చూపించిందామె. "ఏదీ లెట్ మీ సీ..." అంటూ చేయి వేయబోయాడు తిలక్.

"నో... మీరిటు రండి... నేను నవ్య పక్కన కూర్చుంటాను..." అంది జయ. ఇద్దరూ సీట్లు మారారు.

నవ్య చేయి పోనిచ్చి చిన్న పురుగు లాంటి దాన్ని బయటికి తీసింది. "ఈ మాత్రం దానికేనా అంత కేక పెట్టావ్? నువ్వే తీసుకోవచ్చుగా..." అంది కోపంగా.

"ఎందుకోనే... భలే భయం వేసింది... ఏ తేలో అనుకున్నాను" అని నవ్వింది జయ.

తిలక్ చురచురా చూశాడు జయ వంక.

"మంచి ఛాన్స్ పోగొట్టిందీ జయ... నవ్య ఎంత చక్కగా కోఆపరేట్ చేస్తోందీ! మధ్యలో ఇదో అడ్డు... కబుర్లు చెప్తుంది, కవ్విస్తుంది. కానీ మీద చెయ్యి వేయనివ్వదు. తనేదో పెద్ద అందగత్తెనని, వెంట తిప్పుకోవాలని అనుకుంటుంది." అని సణుక్కున్నాడు.


ఇదివరలో రెండు మూడు సార్లు జయ కోసం ప్రయత్నం చేసి ఆశాభంగం చెందాడు తిలక్.

"నువ్వెవరినైనా ప్రేమిస్తే అతనితో ఎంతైనా తిరుగు. మాట్లాడు. కానీ పెళ్ళికి ముందుగా ఎటువంటి తెలివి తక్కువ పనీ చేయకు సుమా! అంతా కానిచ్చి పెళ్ళనగానే చల్లగా జారుకుంటారు దొంగ వెధవలు" అంటూ


## బాపూజీ పుట్టిన దినం

బాపూజీ! నీవు పుట్టిన దినం
సర్వ ప్రపంచానికొక సుదినం!
ప్రగతి పథంలో నీవు వేసిన ప్రతి అడుగు
ముందు తరాల వారికి అనుభవాల మడుగు!
మేమంతా భవదీయ వారసులం
సత్యాహింసలు పాటించలేని నీరసులం!
చెట్టు పేరున కాయలమ్మే ప్రబుద్ధులం
ధర్మం పేరున నాటకమాడే వక్రబుద్ధులం!
నీ అనుయాయులమని బాకా ఊదే
గాంధేయులం
అధికార మధాంధతతో విర్రవీగే
గాంధారేయులం!
స్వాతంత్ర్య సమరంలో నీది దూరాలోచన
స్వాతంత్ర్యాన్ని సంతకంప మారి దురాలోచన!
స్వాతంత్ర్య పోరాటంలో చూపావెంతో నిగ్రహం
నడి వీధిలో పెట్టి పూజిస్తున్నాం నేడు నీ
విగ్రహం!
ఎంతో ప్రయాసతో చేరుకోగలిగాం
చంద్రమండలం
కించిత్ శుద్ధి చేసుకోలేకపోతున్నాం మా
హృదయ మండలం!
కులగోత్రాలంటే మాకు చాలా ముఖ్యం
మత విద్వేషాలకు ఇస్తాం ప్రాముఖ్యం!
మా నరనరాల్లో
జీర్ణించుకుని ఉంటుంది స్వార్థం
రేపెవరు పెడతారో తెలియదు
మాకు శ్రాద్ధం!
స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు ముఖం
వాచిపోతున్నాం
మానవతే సాయంకాలనికై ఎదురు చూస్తున్నాం!
నేడు ఎటుగన్నా ఇదే ప్రపంచపు స్థితి
ఇంత కన్నా బాగు పడబోదు మా పరిస్థితి!
మహాత్మా! మరలా ఈ అవనిపై అవతరించు!
నీ రాకకై ఎదురు చూస్తున్న
మము అనుగ్రహించు!!

- వల్లమేటి సుందరరామయ్య



## ఎయిర్ కూలర్- జాగ్రత్తలు



ఎండాకాలం తట్టుకోలేని ఎండ కారణంగా కూలర్‌ను ఉపయోగిస్తాం. అయితే చలికాలం రాగానే కూలర్ పూర్తిగా మూలపడిపోతుంది. ఫ్యాను గాలికే మనకు ఒణుకు పుట్టేస్తుంది. కాబట్టి కూలర్ వాడకం అస్సలు ఉండదు. అలా అని కూలర్‌ను ఎలా పడితే అలా పడేస్తే పాడవుతుంది. కూలర్‌ను మళ్ళీ వచ్చే ఎండాకాలం వరకూ పాడవకుండా భద్రపరుచుకోవాలంటే కొన్ని చిన్న చిన్న జాగ్రత్తలు పాటించ వలసిన అవసరం ఉంది. అవి ఏంటో తెలుసుకుందాం:

◆ కూలర్‌లో ఉండే నీటిని పూర్తిగా తొలగించాలి.

◆ కూలర్ లోపల ఉండే వట్టివేళ్ళ తడికలను తీసి శుభ్రంగా నీళ్ళతో కడగాలి. ఒకవేళ పాడైపోయినట్లయితే వాటిని పారేసి కొత్తవి కొనుక్కోవాలి.

◆ అలాగే కూలర్ ట్యాంకును కూడా శుభ్రపరచాలి. అందులో నీరంతా తీసేసి పొడి బట్టతో తుడవాలి. కూలర్ ట్యాంకు మురికిగా ఉన్నట్లయితే నీళ్ళు పోసి బట్టతోగానీ లేదా బ్రెష్‌తోగానీ శుభ్రం చెయ్యాలి. ట్యాంకు పూర్తిగా శుభ్రం అయ్యాక తుడిచి ఎండలో ఆరబెట్టాలి. ట్యాంకు కలర్ పెయింట్ డబ్బాను తీసుకొని బ్రెష్‌తో లోపల, బయట పెయింట్ వెయ్యాలి. దీనివల్ల దాని జీవిత కాలం పెరుగుతుంది.

◆ ఇప్పుడు మిషన్ ఆయిల్ తీసుకొని కూలర్‌లోని ఫ్యాన్ రెక్కలకు, పంపుకు ఆయిలింగ్ చెయ్యాలి.

◆ కాస్తంత గ్రీజ్‌ను కూలర్‌లో ఉండే నట్స్-బోల్ట్స్‌కు పట్టిస్తే తుప్పు పట్టకుండా ఉంటాయి. అంతేకాదు విప్పదీయడానికి త్వరగా వస్తాయి. తుప్పు పట్టడం వల్ల నట్లు త్వరగా రావు. కొన్ని సమయాల్లో వీటిని కట్ చేసి తియ్యవలసి వస్తుంది.

పైన పేర్కొన్న జాగ్రత్తలు పాటిస్తే ఇక మీ కూలర్ వచ్చే ఎండాకాలం వరకూ సురక్షితంగా ఉన్నట్లే. పాత బెడ్‌షీట్‌ను కవర్‌గా కుట్టించి కూలర్‌పై వేస్తే మట్టి, దుమ్ము చేరకుండా ఉంటాయి.

**- భారతి**

రోజుకొక్కసారైనా హెచ్చరించే మోడ్రన్ బామ్మగారున్నారు జయకు. ఆ మాటలు తు.చ. తప్పకుండా పాటిస్తుంది జయ.

మండల ప్రజాపరిషత్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేసే తిలక్ జయ వాళ్ళింటికి దగ్గర్లోనే, పక్క వీధిలో ఒక రూమ్ అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అన్నగారమ్మాయిని స్కూల్‌లో చేర్పించటానికి వెళ్ళినప్పుడు జయకతను పరిచయమయ్యాడు. తొలి చూపులోనే కాకపోయినా క్రమంగా అతను మాట్లాడే తీరు, ఆ మేనరిజమ్స్ ఆమెను ఆకట్టుకున్నాయి. డిగ్రీ పాసైన జయకు తగిన సంబంధం కోసం వెతుకుతున్నారు ఆమె అన్న, తండ్రి.

కాన్వెంట్‌లో టీచర్‌గా పని చేస్తున్న నవ్య జయకి బాల్యం నుండీ స్నేహితురాలే. నవ్య తండ్రి పోలీసు కానిస్టేబుల్. ఒక్కగానొక్క కూతురికి మంచి చదువు, ఉద్యోగం ఉన్న యోగ్యుడైన వరుడిని అన్వేషిస్తున్నాడాయన.

"తిలక్‌గారూ! పాట చాలా బావుంది కదూ!" కొంచెం అతని వైపు వంగి అంది జయ.

"యస్... ఇట్స్ నైస్" అన్నాడతను తల పంకిస్తూ.

"సరిగా కూర్చోవయ్యా... చెయ్యి తగులు తుంది" అంది పక్క సీటు నడివయసావిడ.

చిరాకేసింది తిలక్‌కి. నవ్వొచ్చింది జయకి.

"తిలక్ తన భుజంమీద చేయి వేయడం, తను అభ్యంతర పెట్టకపోవడం కొంపదీసి ఈ జయ గమనించలేదు కదా! గమనించే సీటు మారిందేమో? అయినా తనేమిటి? అతనలా చొరవగా ప్రవర్తిస్తుంటే మిన్నకుండిపోయింది... ఛీ... చీ... ఎంత అసహ్యంగా బిహేవ్ చేశాడు... ఎంత ధైర్యం? తనూరుకోబట్టేగా మరింత అడ్వాన్స్ కావడానికి ప్రయత్నించాడు. తనదీ తప్పుంది. తన మనసుకేదో మైకం కమ్మింది. ఇకమీదెప్పుడూ ఇలా జరగకూడదు. నేను కాస్త జాగ్రత్తగా ఉండాలి" అనుకుంది నవ్య.

ఇంటర్‌మిషన్‌లో జయ బయటికెళ్ళింది. తిలక్ వెంటనే ఆమె సీటులోకి వచ్చి "నవ్యా... ఐ లవ్ యూ... ఐ వాంట్ యూ" అంటూ ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

"ప్లీజ్ వదలండి... ఎవరన్నా చూస్తే బావుండదు" చుట్టూ చూస్తూ అందామె.

"మన ఫ్రెండ్‌షిప్ డెవలప్ కావాలి" అన్నాడు గభాల్న ఆమె చేతిని ముద్దు పెట్టుకుంటూ. నవ్య చేతిని లాక్కుని లేచి బయటికి నడిచింది.

జయ వచ్చి తన సీట్‌లో కూర్చున్న అతన్ని చూస్తూ "నవ్యేది... ఇందాక నాతో రాకుండా ఇప్పుడు వెళ్ళింది. దీని పద్ధతంతా విచిత్రంగా ఉంటుంది. తిలక్... ఇదిగో తీసుకోండి... " అంటూ ఓ పాప్‌కార్న్ ప్యాకెట్టందించింది.

"ఆవిడ గోల భరించలేకుండా ఉన్నాను. నువ్వే ఆ సీట్లో కూర్చో జయా! ప్లీజ్!" అన్నాడు దీనంగా మొహం పెట్టి.

"ఓ.కే." అంటూ వెళ్ళి కూర్చుందామె.

"తిలక్! నా గురించి మీ అభిప్రాయం ఏమిటి?" సూటిగా అతని కళ్ళల్లోకి చూస్తూ అడిగింది.

"ఐ లైక్ యూ వెరీ మచ్ జయా!" అంటూ రెండు చేతుల్తో ఆమె ముఖాన్ని పట్టుకుని పెదవుల మీద గాఢంగా చుంబించాడు.

అనుకోని ఈ ఆకస్మిక చుంబనానికి నిర్ఘాంతపోయిందామె. చిరుకోపంతో చూస్తూ "మరీ అంతలా తొందరైతే ఎలా తిలక్... యు ఆర్ వెరీ స్పీడ్..." అంది పెదవులు కర్చీఫ్‌తో అద్దుకుంటూ.

"మరి ఇది స్పీడ్ లోకం గదా... స్లోగా ఉంటే ఎలా డియర్?" అంటూ మళ్ళీ అవకాశం తీసుకోబోయాడు.

"ఇప్పుడొద్దు... రేపు రూమ్‌కొస్తాను" చెవిలో రహస్యంగా చెప్పింది జయ.

"అబ్బ... ఎన్నాళ్ళికి దయ కలిగింది దేవి గారికి... ఈ దీనుడి జన్మ ధన్యమైంది" అన్నాడు నాటక ఫక్కీలో తిలక్.

మళ్ళీ సినిమా ప్రారంభమైంది. నవ్య వచ్చి తన సీట్‌లో కూర్చుంది. తిలక్‌ని చూసి ముఖం

చిట్లించి "జయా! నువ్వొచ్చి ఇటు కూర్చో" గట్టిగా అంది.

"వద్దమ్మాయ్... అతనిటువైపు రావడానికి వీలులేదు. మీ ఫ్రెండ్ ఇక్కడే కూర్చుంటుంది" అంతకంటే గట్టిగా చెప్పిందా నడివయసావిడ.

ఇంక చేసేదేం లేక కూర్చుండిపోయింది నవ్య. అతని ఆట మాత్రం సాగనివ్వలేదు. "మీరు కొంచెం జాగ్రత్తగా కూర్చుంటే మంచిది" అంది చిన్నగా.

"ఓ.కే. ఐ విల్ మీట్ యూ టుమారో" అన్నాడు మెల్లగా ఆమెవైపు వంగి.

పైకలా అందేగాని అతని చొరవ, ఉత్సాహం నవ్యకు నచ్చాయి. "మంచి స్మార్ట్ పర్సన్" అనుకోకుండా ఉండలేకపోయింది.

'నలుపనేగాని కళగల ముఖమే. ఆ కళ్ళల్లో, నవ్వులో ఏదో వింతైన ఆకర్షణ. కొంచెం పొట్టి అయితేనేం... గవర్నమెంటు ఉద్యోగం... అమ్మా నాన్నకి చెప్పి చూస్తాను. ఇతనితో మాట్లాడమని' అనుకుంటూ కావాలనే తన కాలు అతని కాలుకు తగిలేటట్టు కూర్చుంది. ఆ స్పర్శ అతనిలో గిలిగింతలు పెట్టసాగింది. అతని చేతి మీద చేయి వేసింది. తీయని బాధతో మెలికలు తిరిగి పోయాడతను. అంతలోనే 'సారీ' అంటూ చేయి వెనక్కి తీసుకుంది నవ్య.

ఇదంతా మొదట్నించీ గమనించకపోలేదు జయ. "ఇంకా తనాలస్యం చేస్తే ఈ తిలక్... లవ్లీ మేన్ తనకి దక్కకుండా పోతాడు. ఈ నవ్యే ఎగరేసుకుపోయేటట్లుంది. బామ్మ మాటలు విని తనిన్నాళ్ళూ, అతనితో పరిచయం పెరిగినా హద్దుల్లోనే పెట్టింది. ఒంటి మీద చెయ్యి వేయనివ్వలేదు. మరీ ఇట్లా ఉంటే మగవాడికేం ఇష్టం ఉంటుంది? అందులో తిలక్ లాంటి ఉల్లాస పురుషుడి ముందు మడి కట్టుకు కూర్చుంటే తనతనికేం నచ్చుతుంది? తనూ కొంచెం స్పీడ్‌గా ఉండటం నేర్చుకోవాలి. అయినా అన్నాడుగా తనంటే చాలా ఇష్టమని. రేపతన్ని ఇంటికి తీసుకువెళ్ళి నాన్నతో మాట్లాడించాలి. ఎవడో డల్‌గాణ్ణి చేసుకునే కంటే తిలక్ వంటి శృంగార పురుషుడికి భార్య కాగలిగితే బ్రతుకు సార్థకమవుతుంది. అతనితో ప్రతి రాత్రీ వసంత రాత్రే అవుతుంది. మధురమైన ఊహలతో తేలియాడుతూ తలను మెల్లిగా అతని భుజానికాన్చింది. తిలక్‌కి చాలా ఆనందంగా ఉంది. 'నారీ నారీ నడుమ మురారి'ని అనుకున్నాడు సంబరంగా.

సినిమా పూర్తయ్యి లైట్లు వెలిగేసరికి ఎవరి సీట్లలో వాళ్ళు సరిగా సర్దుకుని కూర్చున్నారు.

ఎవరి ఇంటి దగ్గర వాళ్ళని డ్రాప్ చేసి రూమ్‌వైపు నడిచాడు సన్నగా ఈలపాట పాడుకుంటూ తిలక్.

'రేపు జయ... ఎల్లుండి నవ్య... ఓహ్... వాట్ ఎ లక్కీ మాన్ ఐ యామ్!" అనుకుని మురిసి పోయాడు.

* * *

సాయంకాలం ఆరింటికి వస్తానని తిలక్‌కి చెప్పిన జయ అంతదాకా ఆగలేక ఐదింటికే బయలుదేరింది అందంగా ముస్తాబైంది. 'మళ్ళీ ఎనిమిదింటికల్లా అతన్నింటికి తీసుకువచ్చి నాన్నతో పెళ్ళి విషయం మాట్లాడించాలి' అనుకుంటూ వడివడిగా నడిచివచ్చింది అతని రూమ్ దగ్గరికి.

"సుందరీ... దయచేసి నన్నల్లరిపాలు చేయకు... పెద్ద ఇల్లు చూశాక నిన్ను తీసుకు వస్తానిక్కడికి. ఒక్క రెణ్ణెళ్ళు ఓర్చుకో..." ప్రాధేయపడుతున్నట్లుగా అంటున్నాడు తిలక్.

"లక్ష రూపాయలు కట్నం ఇచ్చి, వేలకు వేలు ఖర్చు పెట్టి పెళ్ళి చేసింది చాలక ఇంకా కూతుర్ని ఎన్నాళ్ళు ఇంట్లో పెట్టుకుని పోషిస్తారు మా వాళ్ళు? నాల్రోజుల్లో చూడండి ఇల్లు. నేనిక పుట్టింట్లో ఉండేది లేదు. ఈ నాల్రోజులూ ఈ రూమ్‌లోనే సర్దుకుందాం" అంటూ అరుస్తోందామె.

"ఏమయ్యా తిలక్... పెళ్ళి కాలేదని చెప్పావ్... అదేం బుద్ధి! వెంటనే రూమ్ ఖాళీ చేసేయ్..." అని ఇంటి ఓనర్ బజార్లో నిలబడి అరుస్తున్నాడు.

పరిస్థితంతా అర్థమైపోయిన జయ "యూ రోగ్!" అంటూ ఆరంభించి ఇంగ్లీషులో నాలుగు తిట్లు తిట్టి చరచరా నవ్య ఇంటివైపు నడిచింది.

జయ వెళ్ళేసరికి ఆ ఇంట్లో పెళ్ళిచూపుల తంతు జరుగుతోంది. వరుడడిగిన ప్రశ్నలకు ఉత్సాహంగా సమాధానమిస్తోంది నవ్య.

"పిల్ల మాకు నచ్చిందర్రా... మిగిలిన విషయాలంటారా, ముందే మాట్లాడుకున్నాం కనుక సమస్యే లేదు. ముహూర్తాలు పెట్టించండి" అని లేచారు వాళ్ళు.

తరువాత కాస్సేపటికి జయ చెప్పిందంతా విని నవ్య పైకి "పోనిద్దూ... వాడూ, వాడి అవతారం తలుచుకుంటేనే రోత పుడుతోందబ్బా! ఈ వరుణ్ణి చూశావుగా... తెల్లగా, పొడుగ్గా, అమితాబ్ బచ్చన్‌లా నన్నెంతో ఎట్రాక్ట్ చేశాడు!" అని 'అయితే ఆ రసికత విషయంలో ఎలా ఉంటాడో?' అనుకుంది స్వగతంలో.

'నవ్య చెప్పింది నిజమే... బొగ్గు మొహమూ, వాడూనూ... తలుచుకుంటేనే ఒళ్ళు తిప్పుతోంది' అనుకుంటూ లడ్డు తీసి నోట్లో పెట్టుకుంది జయ!

*

## 'దటీజ్ చిరంజీవి'

అనుకున్నాడట సచిన్ టెండూల్కర్. ఇటీవల సినిమా హీరోలు, క్రికెటర్లూ కలిసి మ్యాచ్ ఆడిన విషయం తెలిసిందే. క్రికెటర్లందరికీ తన ఇంట్లో ఆతిథ్యమివ్వడానికి మెగాస్టార్ స్వయంగా ఎయిర్‌పోర్టుకెళ్ళి స్వాగతం చెప్పాడు. అలాగే సచిన్‌ను తన కారులో కూర్చోబెట్టుకుని ఇంటికి బయలుదేరాడట. మార్గమధ్యంలో ఒక నడివయసు మహిళ కారుకడ్డంపడి చిరుని చూడాలని బయటికి రమ్మని ప్రాధేయపడటం మొదలుపెట్టిందట. బయటికెళ్తే వీరాభిమానులు ఎక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తారోనని చిరు భయం. చివరకు పోలీసులు కల్పించుకోవటంతో సమస్య ముగిసింది. కానీ మెగాస్టార్‌ని చూడటానికి అభిమాని పడ్డ ఆరాటం చూసి చిరంజీవిని అభినందించకుండా ఉండలేకపోయాడట సచిన్.

